# 18

# అద్భుతముల ద్వితీయ సముదాయం

## (8:23-9:8)

మత్తయి 8:23–9:8, యేసు చేసిన యింకా మూడు అద్భుతములను బయలు పరచుచున్నది. వీటిలో తుపానును నిమ్మళింపజేయుట (8:23–27), దయ్యములు పట్టిన ఇద్దరిని బాగుచేయుట (8:28–34), మరియు పక్షవాతముగలవానిని స్వస్థపరచుట (9:1–8) కలవు. ఈ వృత్తాంతములు ప్రకృతి, ఆధ్యాత్మిక దుష్ట శక్తులు. మరియు శారీరక రుగ్మతలపై యేసు కలిగియుండిన అధికారమును సోదాహరణంగా చిత్రీకరించుచున్నవి. ఇవి ఒక ప్రక్క విశ్వాసము మరియు సందేహము, మరొక ప్రక్క అంగీకారము మరియు తృణీకారము మిళితమైయున్న పరిస్థితులై యున్నవి.

### తుఫానును నిమ్మళింపజేయుట (8:23–27)

**23ఆయన దోనె యెక్కినప్పుడు ఆయన శిష్యులు ఆయన వెంట వెళ్లిరి. 24అంతట సముద్రముమీద తుపాను లేచినందున ఆ దోనె అలలచేత కప్పబడెను. అప్పుడాయన నిద్రించుచుండగా 25వారు ఆయన యొద్దకు వచ్చి– ప్రభువా, నశించిపోవుచున్నాము, మమ్మును రక్షించుమని చెప్పి ఆయనను లేపిరి. 26అందుకాయన–అల్పవిశ్వాసులారా, యెందుకు భయపడుచున్నారని వారితో చెప్పి, లేచి గాలిని సముద్రమును గద్దింపగా మిక్కిలి నిమ్మళమాయెను. 27ఆ మనుష్యులు ఆశ్చర్యపడి–ఈయన ఎట్టివాడో; ఈయనకు గాలియు సముద్రమును లోబడుచున్నవని చెప్పుకొనిరి.**

ఇప్పుడు సన్నివేశము నిబద్ధతలేని అనుచరుల నుండి (8:18–22) అవిశ్వాసమును ప్రదర్శించిన శిష్యుల వైపునకు (8:23–27) మారిపోవుచున్నది. యేసు తరుచుగా అనుచరులై యుండుటకు అవకాశముండిన వారి చేత సమీపింపబడుచుండెను మరియు ప్రస్తుతము ఆయనను వెంబడించుచుండిన వారి చేత నిరాశ చెందుచుండెను.

**వచనము 23**. వారు సముద్రపుటద్దరికి వెళ్లునట్లు చివరకు యేసు దోనె లోనికి ప్రవేశించినప్పటికి ప్రొద్దుగ్రుంకనై యుండెను. పన్నెండు మంది శిష్యులలో నుండి కొందరు ఆయనతో కూడ దోనెలో పయనించుచుండిరి. మిగిలిన ఇతర శిష్యులు వెవ్వేరు దోనెలలో ఆయన వెళ్లుచుండిన దోనెను వెంబడించుచుండిరి (మార్కు 4:35–36).

**వచనము 24**. యేసు మరియు ఆయన శిష్యులు తమ ప్రయాణమును మొదలుపెట్టిన తరువాత, **సముద్రముపై గొప్ప తుపాను లేచెను**. గలిలయ సముద్రమునకు సంబంధించినంత వరకు, రాబర్ట్ హెచ్. మౌన్స్ ఇలా వివరించుచున్నాడు,

> బేరిపండు ఆకారములో నున్న ఈ సరస్సు (ఎనిమిది మైళ్ల వెడల్పు, ఉత్తరము నుండి దక్షిణమునకు పదమూడు మైళ్ల పొడవు) సముద్ర మట్టమునకు 680 అడుగుల ఎత్తులో

> ఉన్నది. దాని చుట్టూర నున్న ఎత్తయిన కొండలు, ఎత్తైన స్థలముల నుండి ఎటువంటి హెచ్చరిక లేకుండానే సరస్సు మీదికి అతి శక్తివంతముగా వీచుచుండు గాలులను ఆకర్షించుటకు పెద్ద గరాటాల వలె పనిచేయుచుండు లోతైన లోయలుగలవై యున్నవి.[1]

కొండల మీదుగా వీచు చల్లని గాలులు గలిలయ ఆనకట్ట ప్రాంతంలోని వెచ్చనైన గాలులను కలిసికొనినప్పుడు వేంద్రు, అన్నింటినీ నాశనముచేయు సుడిగాలి ప్రభావము గలిలయ సముద్రపు నీటిని కుదిపేస్తుంది. "తుఫాను" అని అనువదింపబడిన గ్రీకు పదము *seismos* ఈ వచనములో ఎందుకు ప్రయోగింపబడినదో, తీవ్రమైన ఈ వాతావరణ నమూనా వివరించుచున్నది; ఈ పదము సర్వసాధారణంగా ఒక "భూకంపమును" సూచించును (24:8; 27:54; 28:2; అపొస్తలుల కార్యములు 16:26; ప్రకటన 6:12; 8:5; 11:13, 19; 16:18). ఈ తుఫానులు ఆకస్మిక భయంకరత్వముతో లేవవచ్చును (14:24 చూడు).

చేపలు పట్టుటకు ఉపయోగింపబడుచుండిన ఆ చిన్న **దోనె** (*ploion*) **అలల చేత కప్పబడెను.** "అప్పుడు పెద్ద తుఫాను రేగి ఆయన యున్న దోనె మీద అలలు కొట్టినందున దోనె నిండిపోయెనని" మార్కు సువార్త రచయిత వ్రాయుచున్నాడు (మార్కు 4:37). అలలు దోనెను నింపుచుండగా, **యేసు నిద్రించుచుండెను**. తీవ్రముగా వీచుచుండిన సుడిగాలులు గాని, సముద్రపు నీటిని కుదిపేస్తుండిన అలలు గాని యేసు ప్రభువును మేల్కోల్పలేకపోయినవి. లేఖనములలో, సుఖమైన గాఢ నిద్ర, ఒకడు దేవునియందుంచు నమ్మకమును సూచించుచున్నది (యోబు 11:18, 19; కీర్తనలు 3:5; 4:8; 127:2; సామెతలు 3:24–26; అపొస్తలుల కార్యములు 12:6, 7).

**వచనము 25.** యేసునకు, ప్రశాంతంగా నిద్రించుచుండిన యేసునకు తారతమ్యముగా ఆయన ప్రక్కలోనే ఉండిన శిష్యులు భయభ్రాంతులయ్యారు. **వారు ఆయన యొద్దకు వచ్చి, ప్రభువా, నశించిపోవుచున్నాము; మమ్మును రక్షించుమని** చెప్పి ఆయనను లేపిరి! మరొక సందర్భములో, పేతురు నీళ్ల మీద నడుచుచు యేసు నొద్దకు వెళ్లుచుండగా మునిగిపోసాగినప్పుడు, "ప్రభువా, నన్ను రక్షించుమని" కేకలు వేసాడు (14:30).

**వచనము 26.** యేసు మేల్కొని వారిని గద్దించుచు, **అల్పవిశ్వాసులారా, యెందుకు భయపడుచున్నారు**? అని పలికాడు. "భయపడుట" అను అర్థమిచ్చు గ్రీకు పదమునకు (*deilos*) "పిరికి," "అతిభయముగల," లేక "భయమును పుట్టించునట్టి" అని కూడ అర్థము. ఈ శిష్యులు "అల్పవిశ్వాసులై" యుండిరని (*oligopistos*) యేసు చెప్పాడు. గ్రీకు పదము మత్తయి మరియు లూకా వ్రాసిన సువార్తలలో మాత్రమే అగుపించుచున్నది, మరియు ఆయన శిష్యులను వర్ణించుటకు ఈ పదము యేసు చేత మాత్రమే ప్రయోగింపబడినది (6:30పై గల వ్యాఖ్యానమును చూడు). యేసు ఎవరై యుండెనో – సృష్టికర్తయైన దేవుని కుమారుడు – అను విషయమును వారు నిజముగా అంగీకరించియుండినట్లయితే, ఆయన సమస్తమును నియంత్రించగలవాడని గ్రహించియుందురు. యేసు వారితో కూడ ఉన్నాడంటే, క్షేమము కూడ వారి వెంబడే ఉన్నదని ఈ శిష్యులు గ్రహించలేదా? దేవుని ఉద్దేశములను ప్రకృతి భంగపరచజాలదని వారికి తెలియలేదా? యేసు "వారు తమ విన్నపము చేత ఆయన నిద్రను భంగము చేసినందుకు వారిని కోపముతో చీవాట్లుపెట్టలేదు, కానీ భయము చేత వారి విశ్వాసమును తమ్మును తామే భంగము చేసికొనుచుండినందుకు ఆయన వారిని మందలించాడు."[2] వారి "అల్ప విశ్వాసమునకును" మరియు అతని దాసుడు స్వస్థపరచబడిన

శతాధిపతి యొక్క "గొప్ప విశ్వాసమునకును" (8:10) మధ్య గల తారతమ్యమును ఈ అధ్యాయములో గమనించవచ్చును.

అప్పుడు యేసు లేచి **గాలిని, సముద్రమును గద్దింపగా మిక్కిలి నిమ్మళమాయెను.** "గద్దించుట" (*epitimaō*) అను పదము సర్వసాధారణంగా ఒకరు మరొకరి యెడల చేసిన దిద్దుబాటును లేక వారికిచ్చిన హెచ్చరికను సూచించును. ఏదిఏమైనా, ప్రతికూల శక్తులను యేసు అంతము చేసాడని సూచించుటకు అది కొన్ని పర్యాయములు అద్భుతముల గూర్చిన కథనములలో వాడబడినది. ఆయన తుపానును మాత్రమే "గద్దించలేదు," కానీ ఒక జ్వరమును (లూకా 4:39) మరియు ఒక దయ్యమును (లూకా 9:42) కూడ "గద్దించాడు."

యేసు, "నిశ్శబ్దమై, ఊరకుండుమని" పలికినట్లు మార్కు నివేదించుచున్నాడు (మార్కు 4:39). "ఊరకుండుము" అను ఉత్తరువు గ్రీకు పదము *phimoō* నుండి ఉత్పన్నమగుచున్నది. ఈ పదమును "అణచివేయు," ఉదాహరణముగా ఒక పశువు మూతికి చిక్కము కట్టినట్లు (1 తిమోతి 5:18) అని కూడ అనువదించవచ్చును. తుఫాను తత్క్షణమే నిమ్మళమైనది. డి. ఏ. కార్సన్ ఇలా వ్యాఖ్యానించుచున్నాడు,

> ... యేసులో రాచరిక అధికారము మరియు ఒక దాసుని హృదయము మిళితమై యుండినవి. ... యేసు దోనెలో ప్రశాంతమైన గాఢనిద్రలో ఉన్నాడు, తన పరిచర్య ఒత్తిడుల వలన నీరసించి యున్నాడు; అట్లయినప్పటికిని, ఆయన సృష్టికర్తగానే నిలచియుంటున్నాడు, తన వాక్కు చేత తుఫానును నిమ్మళింప జేయుచున్నాడు, సముద్రములను నియంత్రించుచు తుఫానులను నిమ్మళింపజేయగల దేవుని అధికారమును ప్రయోగించుచున్నాడు.[3]

**వచనము 27.** యేసు చేసిన అద్భుతకార్యమునుబట్టి, శిష్యులు **ఆశ్చర్యపడిరి.** "ఆశ్చర్యపడిరి" అను మాటకు గల గ్రీకు పదము (*thaumazō*), "విస్మయమొందిరి" (8:10) అని కూడ అనువదింపబడినది, అది అపరిమితమైన ఆశ్చర్యమును సూచించుచున్నది. వారు ఆశ్చర్యముతో పాటు, "మిక్కిలి భయపడిరి" (మార్కు 4:41). వారు తుఫానుకు భయపడిన దాని కంటే ఎక్కువగా యేసు అధికారమును చూచి అమితాశ్చర్యము అదుపుచేయగలుగుచున్నాడని వారు ఆశ్చర్యపోయారు. అందుచేతనే వారు, **ఈయన ఎట్టివాడో, ఈయనకు గాలియు సముద్రమును లోబడుచున్నవని** చెప్పుకొన్నారు. ఎంతైనా, ఉప్పెనవలె ఉప్పొంగు సముద్రముపై దేవుడు మాత్రమే సార్వభౌముడైన అధికారియై యున్నాడు (యోబు 38:8–11; కీర్తనలు 89:8, 9; 93:3, 4; 104:5–9; 106:9–12; 107:23–29).

## దయ్యములు పట్టిన ఇద్దరిని స్వస్థపరచుట (8:28–34)

**[28]ఆయన అద్దరినున్న గదరేనీయుల దేశము చేరగా దయ్యములు పట్టిన యిద్దరు మనుష్యులు సమాధులలో నుండి బయలుదేరి ఆయనకు ఎదురుగా వచ్చిరి. వారు మిగుల ఉగ్రులైనందున ఎవడును ఆ మార్గమున వెళ్లలేక పోయెను. [29]వారు–ఇదిగో దేవుని కుమారుడా, నీతో మాకేమి? కాలము రాకమునపే మమ్మును బాధించుటకు ఇక్కడికి**

**వచ్చితివా? అని కేకలు వేసిరి. 30వారికి దూరమున గొప్ప పందుల మంద మేయుచుండగా 31ఆ దయ్యములు నీవు మమ్మును వెళ్లగొట్టినయెడల ఆ పందుల మందలోనికి పోనిమ్మని ఆయనను వేడుకొనెను. 32ఆయన వాటిని పొమ్మనగా అవి ఆ మనుష్యులను వదలిపెట్టి ఆ పందులలోనికి పోయెను; ఇదిగో ఆ మందంతయు ప్రపాతము నుండి సముద్రములోనికి వడిగా పరుగైతికొనిపోయి నీళ్లలో పడిచచ్చెను. 33వాటిని మేపుచున్నవారు పారిపోయి పట్టణములోనికి వెళ్లి జరిగిన కార్యములన్నియు దయ్యములు పట్టినవారి సంగతియు తెలిపిరి. 34ఇదిగో ఆ పట్టణస్థులందరు యేసును ఎదుర్కొనవచ్చి ఆయనను చూచి తమ ప్రాంతములను విడిచి పొమ్మని ఆయనను వేడుకొనిరి.**

**వచనము 28**. యేసు జనసమూహములకు దూరముగా నుండిన కొద్దిపాటి సమయములో ఆయనకు చాలినంత విశ్రాంతి దొరకలేదు. గలిలయ సముద్రముపై వీచిన తుఫానును గద్దించిన తదుపరి, ఆయన తన శిష్యులతో కూడ **అద్దరికి చేరుకొన్నాడు**, అయితే వెనువెంటనే అనుకొనని మరొక ఆటంకమును నాటకీయంగా ఎదుర్కొనవలసి వచ్చినది (8:18పై గల వ్యాఖ్యానమును చూడు).

యేసు చేరుకొనిన సముద్ర తీరము **గదరేనీయుల దేశమై యుండినది**, అయితే దీనినే మార్కు మరియు లూకా "గెరాసేనుల దేశమని" పిలుచుచున్నారు (మార్కు 5:1; లూకా 8:26). లూయిస్ ఇలా వ్యాఖ్యానించుచున్నాడు, "యేసు ఇప్పుడు సందర్శించిన ఈ చోటు యొక్క పేరు విషయంలో - కపెర్నహూమునకు ఎదురుగా నున్న తీరము - చేతి వ్రాత ప్రతులు అనిశ్చయతను తెలియజేయుచున్నవి."[4] ప్రాచీన గ్రీకు చేతి వ్రాత ప్రతుల్లో "గెరాసేనులు," "గదరేనియులు," మరియు "గెర్గెసేనులు" అను మూడు పేర్లు కనుగొనబడినవి.[5] ఈ పేర్లు మూడు వెవ్వేరు స్థలములను సూచించుచున్నవి: గెరాస, గదర, మరియు గెర్గేస.

(1) గెరాస, ఈ నాడు "జెరాశా" అని పిలువబడుచున్నది, దెకపొలి ప్రాంతంలో ఒక పట్టణమై యుండినది. అది గలిలయ సముద్రమునకు 35 మైళ్ల దూరములో దక్షిణమున ఆగ్నేయ దిశలో ఉండినది గనుక వాక్యభాగములో ఇవ్వబడిన వర్ణనకు సరిపోదు.

(2) గదర, దెకపొలిలో మరొక పట్టణము, గలిలయ సముద్రమునకు ఆగ్నేయమున ఐదు మైళ్ల దూరములో ఉండినది. అది యార్ముక్ (Yarmuk) నదికి దక్షిణమున గల ఉమ్ ఖెయినతో (Umm Qeis) గుర్తింపబడుచున్నది. దాని సరిహద్దు సముద్ర తీరము వరకుండును, "గదరేనియుల దేశమని" మత్తయి వ్రాసిన వివరమునకు ఇది సరిపడుచున్నది. ఈ అభిప్రాయము, "తిబెరియ సముద్ర తీరము వెంబడి ఉండి. ... గదరకు సంబంధించిన గ్రామములని" జోసీఫస్ లేవనెత్తుచున్న ప్రస్తావన చేత బలపర్చబడుచున్నది.[6] ఈ ఇచ్చకము పై వివరమునకు అత్యంత సమీపముగా నున్నది.

(3) గెర్గెసా, తూర్పు సముద్ర తీరమున నుండిన ఒక నగరమై యుండినది. ఈ నగరమును అనేకులు నేడున్న కుర్సి పట్టణముతో గుర్తించుదురు, అది ప్రాచ్య తీరము యొక్క మధ్య భాగమునకు కొంచెము పై ఎత్తులో నున్నది. 1970వ సంవత్సరముల నడుమ నిర్వహింపబడిన పురావస్తు త్రవ్వకములలో, మొదటి శతాబ్దము నాటి గ్రామమొకటి కనుగొనబడినది, దానితోపాటు ఐదవ శతాబ్దము నాటి క్రైస్తవ దేవాలయము వంటి ఒక

పెద్ద ప్రాచీన రోమా ప్రభుత్వ కట్టడము కూడ కనుగొనబడినది, అది ఈ అద్భుతమునకు స్మారక చిహ్నముగా నిర్మింపబడినది.[7]

యేసు ఈ ప్రాంతములో దయ్యములు పట్టిన **ఇద్దరు మనుష్యులను** ఎదుర్కొన్నాడని మత్తయి వ్రాసిన సువార్త తెలియజెప్పుచుండగా మార్కు మరియు లూకా సువార్త రచయితలు ఒక్కనినే పేర్కొనుచున్నారు (మార్కు 5:2; లూకా 8:27). ఈ రెండు సువార్తలలో ఏదీ కూడ ఒక్క మనుష్యుడే ఉండినాడని నిర్దిష్టముగా తెలియజెప్పుట లేదు, కానీ సేన దయ్యములు పట్టినవాడై మాటలాడుచుండిన వానిపై వారి దృష్టిని కేంద్రీకరించుచున్నారు. అదే విధముగా, యేసు యెరికో పట్టణమునకు సమీపమున ఇద్దరు గ్రుడ్డివారిని స్వస్థపరచి వారికి చూపునను గ్రహించుట గూర్చి మత్తయి 20:30–34 చెప్పుచుండగా, మార్కు మరియు లూకా సువార్తల రచయితలు ఒక్కనినే పేర్కొనుచున్నారు (మార్కు 10:46–52; లూకా 18:35–43). అదొక ఎక్కువ నాటకీయమైన తారసమై యుండినదని మార్కు మరియు లూకా వ్రాయుట తప్ప, ఈ తేడాలకు ఒక ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఆరోపింపబడలేదు. దయ్యము పట్టి పీడింపబడుచునే గొంతెత్తి మాటలాడిన వానిపై ఎవరో ఒకరు వారి దృష్టిని కేంద్రీకరించుట గూర్చి ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

ఈ ఇద్దరు మనుష్యులు **దయ్యములు పట్టినవారై** యుండిరి, అనగా, అపవిత్రాత్మల చేత అదుపు చేయబడుచుండిరి. పాత నిబంధనలో, ఇటువంటి దయ్యములు పట్టిన సంఘటనలు అరుదుగా నున్నవి, అసలు అవి ఎప్పుడైనా జరిగినవో లేదో! పేర్కొనబడిన ఇద్దరు మనుష్యులను అపవిత్రాత్మలు వాస్తవముగా "పట్టినవా" యను విషయము సందేహత్మకమైనదై యున్నది (న్యాయాధిపతులు 9:23–24; 1 సమూయేలు 16:14–23 చూడు). క్రొత్త నిబంధనలో సువార్తల తరువాత, కొన్ని ఉదాహరణములు మాత్రమే గ్రంథస్థం చేయబడినవి (అపొస్తలుల కార్యములు 5:16; 8:7; 16:16–18; 19:11–16). ఖచ్చితముగా, మొర్రిస్ తర్కించుచున్నట్లుగా, "పరిశుద్ధ బైబిల్‌లో దయ్యములు పట్టుట యేసు నరావతారమెత్తుటలో ఆయనకు ఎదురైన దుష్ట వ్యతిరేకత వెల్లువలో భాగమై యున్నదనునది నిజమై యున్నది."[8]

దయ్యములు పట్టిన మనుష్యులు సమాజము వెలివేసినవారివలె **సమాధుల** నడుమ, మృతులైనవారి శల్యములతోను, సమస్త అపవిత్రతతోను నిండుగా నిండియుండిన సమాధుల నడుమ, నివసించుచుండిరి (23:27). వారు బహు **తీవ్రముగా హింసాత్మకమైనవారై** యుండిరి గనుక అట్టి పరిస్థితిలో ఆ ప్రాంతము **మీదుగా పయనించుట** అందరికి అసాధ్యమైనదై యుండినది. పట్టణ వాసులు వారిని వేరుగా, దూరముగా ఉంచుచు వారి ఆకస్మిక దౌర్జన్యపూరితమైన దాడులు మరియు చర్యలు అదుపులో ఉంచబడునట్లు వారిని నిర్బంధించారు, కానీ అదేమీ ప్రయోజనకరముగా పనిచేయలేదు (మార్కు 5:3, 4; లూకా 8:29). వీరిలో కనీసము ఒక్కడైనా ఎడతెగకుండా "సమాధులలోను కేకలువేయుచు, తన్నుతాను రాళ్లతో గాయపరచుకొనుచు నుండెను" (మార్కు 5:5). దయనీయమైన స్థితిలో ఉన్న ఇతడు దయ్యముల సేన చేత పట్టబడి యున్నాడని మార్కు సువార్తికుడు రచించాడు. వాని పేరేమిటో యని యేసు అడిగినప్పుడు వాడు, "నా పేరు సేన; ఏలయనగా మేము అనేకులమని" ప్రత్యుత్తరమిచ్చాడు (మార్కు 5:9) రోమా ప్రభుత్వ సేనలో ఆరు వేల మంది సైనికులుండిరి, కానీ ఈ లెక్క చొప్పున దయ్యములు పట్టిన వీనిని ఆరువేల దయ్యములు

పట్టిన వీనిని ఆరువేల దయ్యములు పట్టినవని అర్థము కాదు. "సేన" అను పదము పెద్ద సంఖ్యను లేక భారీ సమూహమును సూచించుచున్నది.

**వచనము 29.** యేసును చూడగానే, వాడు "పరిగెత్తుకొనివచ్చి, ఆయనకు నమస్కారము చేసెను" (మార్కు 5:6). "నమస్కారము చేసెను" అను మాటకు ప్రయోగింపబడిన గ్రీకు పదము (*proskuneō*) "ఆరాధించెను" అని కూడ అనువదింపబడవచ్చును, ఏలయనగా నమస్కారము చేయుట, రాజు యెడల గల రాజభక్తినిబట్టి ఆయన యెదుట విధేయతతో వంగుటకు లేక భక్తిపూర్వకమైన గౌరవమర్యాదలను కనుపరుచుటకు ఒక సాధారణ వెక్తీకరణమై యుండినది (2:2 పై గల వ్యాఖ్యానమును చూడు). ఈ సందర్భములో, వాడు ప్రదర్శించిన చర్య మానవుడు కనుపరచు భక్తి శ్రద్ధలతో కూడిన అంకిత భావము కంటే, దానికి బదులుగా దయ్యములు ఆయన అధీనమునకు అణుకువతో అప్పజెప్పుకొనుచుండిన పరిస్థితియై యుండినది.

ఈ ఇద్దరిలో ఉండిన దయ్యములు, **నీతో మాకేమి?** అని కేకలు వేసినవి. అవి ఉన్నపాటుననే వాటిని విడచిపెట్టవలెనని అవి ఆశించినవి; యేసుతో ఎటువంటి సంబంధమునైనను పెట్టుకొనుటకుగాని పరిచయమును ఏర్పరచుకొనుటకుగాని అవి కోరలేదు. ఇటువంటి ప్రశ్నలే లేఖనములలో ఇతరమైన చోట్లలో కనబడును (న్యాయాధిపతులు 11:12; 2 సమూయేలు 16:10; 19:22; 1 రాజులు 17:18; 2 రాజులు 3:13; 2 దినవృత్తాంతములు 35:21; మార్కు 1:24; యోహాను 2:4).

దయ్యములు దేవుని యందును, యేసు **దేవుని కుమారుడై యున్నాడని** ఆయనయందును విశ్వసించినవని మూడు సమదృక్పథ సువార్తలు గ్రంథస్థంచేయుచున్నవి (8:29; మార్కు 5:7; లూకా 8:28). "దయ్యములను నమ్మి, వణకుచున్నవని" యాకోబు వ్రాయుచున్న విషయమును (యాకోబు 2:19) ఈ వివరము రూఢిపర్చుచున్నది. యేసు, దేవుని కుమారుడై యున్నాడని దయ్యములు నమ్ముట మాత్రమే కాదు, కానీ ఆయన దేవుని పరిశుద్ధుడై యున్నాడని కూడ అవి ఒప్పుకొనినవి (మార్కు 1:24; 3:11; లూకా 4:41 చూడు).

దయ్యములు, **కాలము రాకమునపే మమ్మును బాధించుటకు ఇక్కడికి వచ్చితివా?** అని యేసును ప్రశ్నించినవి. భవిష్యత్తులో ఏదో ఒక సమయంలో, యాతనకు గురియగు స్థలమునకు అవి పంపబడునని, అవి ఎరిగి యుండినవి (25:41 చూడు).

"పాతాళములోనికి పోవుటకు తమకు ఆజ్ఞాపింపవద్దని" దయ్యములు దీనముగా బ్రతిమాలుకొన్నవి (లూకా 8:31). "పాతాళము," గ్రీకు పదమునకు *abussos* ఒక లిప్యంతరీకరణమై యున్నది, "కొలువబడజాలని లోతు" అని దీని అర్థమై యున్నది. అంత్య తీర్పు ముగియు వరకు అపవిత్రాత్మలు నిర్బంధింపబడి యుండు స్థలమును అది సూచించుచున్నది (2 పేతురు 2:4; యూదా 6 చూడు). KJVలో ఈ పదము సాధారణంగా "నిత్య పాతాళమని" అనువదింపబడుచున్నది. ఈ పాతాళము ఒక లోతైన, దట్టమైన పొగతోను భయభీతిని పుట్టించు జీవులతోను నింపబడి అంధకారమయమై యున్న కాండము వంటిదని ప్రకటన గ్రంథంలో చిత్రీకరింపబడినది. దానికొక గొలుసు కట్టబడి, తాళము వేయబడి యున్నది. దేవుని దూత ఒకనికి దాని తాళము చెవి అప్పగింపబడి యున్నది, గనుక అతడు లోపలకు ప్రవేశించువారిని మరియు వెలుపలకు వెళ్లుచుండువారిని అదుపుచేయుచుండును (ప్రకటన 9:1, 2, 11; 11:7; 17:8; 20:1, 3). యేసు వాటిని

విసిరి పాతాళము లోనికి పారవేయబోవుచున్నాడనియు, కాలము రాకమునుపే వాటిని శిక్షింపబోవుచున్నాడనియు దయ్యములు భయపడుచుండినవి.

**వచనము 30.** యేసు మరియు దయ్యములు పట్టిన ఇద్దరు మనుష్యులకు కొంత **దూరములో, గొప్ప పందుల మంద** "మేయుచుండినవి" (AB). ఆ మంద సంఖ్య "ఇంచుమించు రెండు వేలు" (మార్కు 5:13). ఈ ప్రాంతము పాక్షికముగా అన్యజనుల చేత (సిరియనుల చేత)[9] నిండియుండినది, పందుల పెంపకములో వీరు యూదుల కంటే ఎక్కువ మొగ్గు చూపువారై యుండిరి (7:6పై గల వ్యాఖ్యానమును చూడు). ఇశ్రాయేలు దేశములో, యూదులు "ఎచ్చోటనైనను పందులను పెంచరని" యూదా మత బోధకుల సాంప్రదాయము తెలియజెప్పుచున్నది.[10]

**వచనములు 31, 32.** యేసు, దేవుని కుమారుడై యున్నాడని **దయ్యములు** గుర్తుపట్టుట మాత్రమేగాక (8:29), వాటిని దూరముగా తరిమివేయుటకు ఆయనకు అధికారముండినదని కూడ అవి ఎరిగియుండెను. గనుక అవి, **నీవు మమ్మును వెళ్లగొట్టిన యెడల ఆ పందుల మందలోనికి పోనిమ్మని** యేసును వేడుకొనినవి. డొనాల్డ్ ఏ. హేగ్నర్ చేసిన ఒక ప్రయోజనకరమైన హెచ్చరిక ఈ విధంగా ఉన్నది:

> ఈ సమయంలో చదువరి నిస్సందేహముగా వాక్యభాగములో నుండి వ్యాఖ్యానకర్త సమాధానము చెప్పుటకు సమర్థవంతుడై యుండని ప్రశ్నలను లేవనెత్తును, ఇవి, దయ్యములు ఇటువంటి మనవి ఎందుకు చేసినవి (వచనము 31)? యేసు ప్రభువు వాటి మనవి ప్రకారమే ఎందుకు సెలవిచ్చాడు (వచనము 32)? మొదలగు ప్రశ్నలై యుండును. ఈ ప్రశ్నలలోను మరియు ఇటువంటి ఇతర ప్రశ్నలను, దయ్యముల మానసిక మరియు పారలైకిక ప్రపంచమును గూర్చిన ఎరుక లేకుండా, ఇందుకు సమాధానమిచ్చుటకు ఊహాకల్పితము మాత్రమే మిగిలియున్న శరణ్యమై యున్నది.[11]

పందుల మంద లోనికి వెళ్లి వాటిలో నివసించుటకు అనుమతించవలెనని దయ్యములు చేసిన మనవి, అవి పాతాళము లోనికి ప్రవేశించకుండా తప్పించుకొనుటకు చేసిన ఒక ప్రయత్నమై యుండును. పాతాళములో నిర్బంధింపబడి యుండుట కంటే ఒక పందిలో నివసించుటయే ఉత్తమమైనదై యుండినది! అవి ఏదైన ఒక శరీరములో నివాసమేర్పరచుకొనునంత వరకు అపవిత్రాత్మలు విశ్రమించజాలవని మత్తయి 12:43–45 కూడ సూచించుచున్నట్లు అగుపించుచున్నది. ఏది ఏమైనా, వాటి మనవిలో చూపునకు నిజముగా అమాయకమైన మనవియని అగుపించు అశుభకరమైన అంశము ఒక మూలన దాగియుండి యుండును. పందుల మంద లోనికి ప్రవేశించునట్లు అనుమతించుమని మనవి చేయక మునుపు వాటిలో నాశనము కలుగజేయవలెనను కోరికలుండినవా? ఇటువంటి చర్య జనబాహుళ్యమును యేసునకు విరోధముగా త్రిప్పునని తెలిసియుండి కూడ, ఈ గొప్ప పందుల మందను నాశనము చేయవలెనని వాటికుండిన కోరికయై యుండునా? వాటి ఉద్దేశము ఇదే అయియుండినదో లేదో, కానీ అంతిమ ఫలితం నిశ్చయముగా అదే అయ్యింది.

యేసు ప్రభువు సెలవిచ్చిన సామాన్యమును, ఒక మాటతో కూడినదై యుండిన **పొమ్ము!** అను ఆజ్ఞ జారీ చేయబడగానే ఆ దయ్యములు **పందుల మందలోనికి జొరబడినవి.** వాటి ప్రతిస్పందన నాటకీయమైనదై యుండినది, దయ్యముల చేత వెర్రెక్కిన పందులన్నియు

ప్రపాతము నుండి **సముద్రములోనికి వడిగా పరుగెత్తుకొనిపోయి నీళ్లలో మునిగిపోయెను.** అటుతరువాత ఆ దయ్యములకు ఏమి జరిగిందో, మనకు తెలియదు. అయితే ఒక విషయం గూర్చి మాత్రం మనము నిశ్చయముతో ఉండవచ్చును: అవి దుర్మార్గులైన ఆధ్యాత్మిక జీవులై యుండినవి గనుక, అవి నీళ్లలో మునిగిపోయినంత మాత్రాన నాశనము కాజాలవు. ఈ విధంగా అవి నీళ్లలో పడినప్పుడు నాశనమగునని వాటికి తెలిసియుండినట్లయితే, పందులను సముద్రము లోనికి పరుగులెత్తించవు. దయ్యములు వాటి స్వభావము చొప్పున విధ్వంసకమైనవై యుండగా, అవి స్వయం విధ్వంసకమైనవి కావు.

**వచనము 33.** వాటిని (పందులను) **మేపుచున్నవారు** సొంతదారులు కారని స్పష్టమగుచున్నది, కానీ సొంతదారులు పక్షమున వారు ఆ గొప్ప పందుల మందను మేపవలసిన బాధ్యత అప్పగింపబడిన జీతగాండ్లై యుండిరి. ఈ ప్రాంతము అన్యజనులు నివసించుచుండినదైనందు వలన, ఈ పందుల మంద ఇతరులను జీతగాండ్లుగా నియమించుకొనగలిగినంత ధనికులై యుండిన అన్యజనులకు చెందినదై యుండును.

మందకాపరులు, జరిగినది వారి కళ్లారా చూచినవారు నిర్నిమిత్తముగా పుట్టిన భయము చేత నిస్సందేహముగా వణకిపోయి యుందురు, గనుక **పారిపోయి, పట్టణములోనికి వెళ్లి జరిగిన కార్యములన్నియు దయ్యములు పట్టినవారి సంగతియు తెలిపిరి.** నిశ్చయముగా వారు గొప్ప పందుల మంద నశించుటవలన జరిగిన ఈ ఆర్థిక నష్టమును పూరించవలెనని ఆశించలేదు. ఈ మందకాపరులు **దయ్యములు పట్టినవారికి జరిగిన విషయమును సహితము ప్రజలకు తెలియజెప్పారు.**

**వచనము 34.** మందకాపరులు తెలియజెప్పిన సమాచారము గొప్ప కలకలమును కలిగించినది, గనుక ఇదిగో **ఆ పట్టణస్థులందరు యేసును ఎదుర్కొన వచ్చిరి**. ఆ సమయంలో యేసు అక్కడనే ఉండుట చూచినప్పుడు, వారేం చూశారు? మార్కు తన దృష్టిని కేంద్రీకరించుచున్న మనుష్యుడు – నిస్సంశయముగా రెండవ వానితో కూడ – "బట్టలు ధరించుకొని, స్వస్థచిత్తుడై కూర్చుండి యుండెను" (మార్కు 5:15). యేసు ఉప్పెనవలె ఉప్పొంగిపోవుచుండిన తుఫానును నిమ్మళింపజేసినట్లే (8:26), అదుపుచేయబడలేకుండా హింసాత్మకముగా ప్రవర్తించుచుండిన ఈ ఇరువురి జీవితాల్లో కూడ సమాధానమును కలుగజేసాడు.

ఆ పట్టణములో నుండి వచ్చిన ప్రజలంతా స్వయంగా యేసు నొద్దకు వచ్చిన తరువాత, **తమ ప్రాంతములను విడచిపొమ్మని ఆయనను వేడుకొనిరి.** పందులు నాశనమగుట వలన కలిగిన నష్టమునుబట్టి ఆ ప్రజలందరు మనస్సు చెదరిపోయినవారయ్యారని కొందరు విశ్వసించుచుండగా, మార్కు వ్రాసిన సువార్త వారి అందోళనకు గల మరొక హేతువును సూచించుచున్నది: యేసు యొక్క అమితాశ్చర్యమును గొలుపు అధికారమునుబట్టి "వారు భయపడిరి" (5:15). వారు నిస్సహాయులయ్యారు, గనుక అదివరకు దయ్యములు పట్టినవారై యుండినవారిని బహుశా – పందుల కళేబరములు సముద్రములో తేలియాడుచుండుట కూడ చూచినప్పుడు మందకాపరులు ఇచ్చిన సాక్ష్యమును అంగీకరింపక తప్పలేదు.

అప్పుడే స్వస్థచిత్తుడైనవాడు "ఆయన యొద్ద తన్నుండనిమ్మని" ఆయనను బతిమాలుకొనెనని కూడ మార్కు వ్రాయుచున్నాడు (మార్కు 5:18). అందుకు యేసు, "నీవు నీ యింటివారి యొద్దకు వెళ్లి, ప్రభువు నీయందు కనికరపడి నీకు చేసిన కార్యములన్నిటిని

వారికి తెలియజెప్పుమనెను" (మార్కు 5:19). తత్ఫలితంగా, వాడు "వెళ్లి, యేసు తనకు చేసినవన్నియు దెకపొలిలో ప్రకటింప నారంభింపగా, అందరు ఆశ్చర్యపడిరి" (మార్కు 5:20).

## పక్షవాతముగలవానిని స్వస్థపరచుట (9:1-8)

ఈ వృత్తాంతము యేసు పక్షవాతముగలవానిని స్వస్థపరచి వాని పాపములు క్షమించిన పట్టణములోని ఒక గదిలో జరుగుచున్నదై యున్నది. ఆయన దేవదూషణ చేయుచున్నాడని యూదా మత నాయకులు యేసును నిందించుచుండగా, ఆయన చేయుచుండిన కార్యములను కళ్లారా చూచుచుండిన ప్రజలు ఆశ్చర్యపడుచు దేవుని స్తుతించుచుండిరి.

**1తరువాత ఆయన దోనె యెక్కి సముద్రము దాటి తన పట్టణములో ప్రవేశింపగా**
**2ఇదిగో జనులు పక్షవాయువుతో మంచముపట్టియున్న యొకని ఆయనయొద్దకు**
**తీసికొనివచ్చిరి. యేసు వారి విశ్వాసము చూచి కుమారుడా ధైర్యముగా ఉండుము, నీ**
**పాపములు క్షమింపబడియున్నవని పక్షవాయువు గల వానితో చెప్పెను. 3ఇదిగో శాస్త్రులలో**
**కొందరు–ఇతడు దేవ దూషణ చేయుచున్నాడని తమలోతాము అనుకొనగా 4యేసు వారి**
**తలంపులు గ్రహించి–మీరెందుకు మీ హృదయములలో దురాలోచనలు చేయుచున్నారు? 5నీ**
**పాపములు క్షమింపబడియున్నవని చెప్పుట సులభమా, లేచి నడువుమని చెప్పుట సులభమా?**
**6అయినను పాపములు క్షమించుటకు భూమిమీద మనుష్యకుమారునికి అధికారము కలదని**
**మీరు తెలిసికొనవలెను అని చెప్పి, ఆయన పక్షవాయువుగలవాని చూచి–నీవు లేచి నీ మంచ**
**మెత్తికొని నీ యింటికి పొమ్మని చెప్పగా 7-8వాడు లేచి తన యింటికి వెళ్లెను. జనులు అది**
**చూచి భయపడి, మనుష్యులకిట్టి అధికారమిచ్చిన దేవుని మహిమపరచిరి.**

**వచనము 1.** యేసు గదరేనియుల దేశములో అంత గొప్ప అద్భుతకార్యము చేసినప్పటికిని, ఆయన తమ ప్రాంతములను విడచిపెట్టి వెళ్లిపోవలసినదని ఆ పట్టణములోని ప్రజలందరును ఆయనను వేడుకొన్నారు. అందుకాయన సమ్మతించి **ఆహ్లాదకరంగా దోనెయెక్కి సముద్రము దాటివెళ్లాడు**. "దోనె" మరియు "సముద్రము దాటి ఆద్దరికి వెళ్లుట"ను గూర్చిన ఇటువంటి ప్రస్తావనలు దీనికి ముందటి అధ్యాయంలో చూడనగును (8:18, 23, 28), మరియు యేసు సముద్రమునకు సమీపములో నుండిన ఆయా పట్టణముల నడుమనే సంచరించుచుండెనని ఇవి చూచించుచున్నవి.

యేసు సముద్రమునకు తూర్పు దిక్కున నుండిన ప్రదేశములను, అనగా ప్రబలంగా అన్యజనులు ప్రబలియుండిన ప్రాంతములను విడిచి, పశ్చిమ దిక్కునకు, ప్రధానంగా యూదుల చేత నిండియుండిన చోటికి వచ్చాడు. సరైన సమయానికి, ఆయన **తన సొంత పట్టణమునకు**, అనగా కపెర్నహూమునకు, గలిలయ సముద్రమునకు వాయవ్య తీరమున నుండిన పట్టణమునకు చేరుకొన్నాడు (4:13 పై గల వ్యాఖ్యానమును చూడు). ఈ సమయంలో, ఇదివరకు వలెనే, ఆయన పేతురు మరియు పేతురు కుటుంబముతో సహవసించి యుండును (8:5, 14; మార్కు 1:21, 29; 2:1).

**వచనము 2.** అంతకు పూర్వము, యేసు కపెర్నహూము పట్టణమును విడచివెళ్లిపోయినప్పుడు, జనసమూహములు ప్రతినిత్యము ఆయనను చుట్టుముట్టి

యుండుటనుబట్టియు, బహుశా తద్వారా ఏర్పడిన శారీరక అలసట మరియు నిస్సత్తువనుబట్టియు ఆయన పట్టణమును విడచివెళ్లియుండవచ్చును (8:18; మార్కు 1:35-38; లూకా 5:15, 16 చూడు). ఏదిఏమైనా, ఆయన "తన సొంత పట్టణమునకు" తిరిగి వచ్చాడు. ఆయన వచ్చిన వార్త వెంటనే పట్టణమంతా వ్యాపించినది. మరొక పర్యాయము, జనసమూహములు ఆయనను చుట్టుముట్టి యుండెను, స్వస్థపరచబడు నిమిత్తము వారు రోగులైన తమ ప్రియులను ఆయన యొద్దకు తీసికొనివచ్చుచుండిరి; గనుక, దేవుని కనికరమును కనుపరచు గంభీరమైన అభివ్యక్తముగా, ఆయన వారిపై జాలిపడెను (9:8; మార్కు 2:1, 2; లూకా 5:15).

ఇతర రెండు సమదృక్పథ సువార్తలు తెలియజెప్పుచున్నంతగా మంచము పట్టియుండిన **పక్షవాతముగలవానిని స్వస్థపరచుట** గూర్చి మత్తయి మనకు చాలినన్ని వివరములు సమకూర్చుట లేదు (మార్కు 2:1-12; లూకా 5:17-26). స్పష్టంగా, వాని పక్షవాతము, యేసు ఉండిన చోటికి వానిని మంచము మీద మోసికొని రావలసినంత తీవ్రమైనదై యుండినది.

పక్షవాతముగలవాడు నలుగురు స్నేహితుల చేత లేదా కుటుంబ సభ్యుల చేత యేసు ఉండిన చోటికి **తీసికొనివచ్చినప్పుడు**, ఇంటిలో కూడుకొని యుండిన అనేకులనుబట్టి వారు వానిని యేసుకు దగ్గరగా తీసికొని వెళ్లలేకపోయారని మార్కు మరియు లూకా చెప్పుచున్నారు (మార్కు 2:4, 5; లూకా 5:19). చాకచక్యముతో, వారు పైకప్పుమీదికెక్కి బహుశా అది సమతలముగా ఉండియుండును, పైకప్పు విప్పి, సందు చేసారు. యేసు ఉండిన చోట వానిని దింపుటకు ఒక విధానమును రూపొందించుకొనిన తరువాత, వానిని నెమ్మదిగా యేసు యెదుట దింపారు (మార్కు 2:3, 4; లూకా 5:18, 19).

వానిని మోసికొనివచ్చినవారి యొక్కయు, బాధపడుచుండినవాని యొక్కయు **విశ్వాసమునుబట్టి** ప్రభావితుడై, యేసు వానితో పలికిన మొదటి పలుకులు, **కుమారుడా, ధైర్యముగా ఉండుము.** "ధైర్యముగా ఉండుము" అను పదజాలమునకు ఇచ్చట ప్రయోగింపబడిన గ్రీకు పదము (*tharseō*) భయమును పారదోలు ఆలోచనా ధోరణిని సూచించుచున్నది. "కుమారుడా, భయపడకుము" అని ప్రభువు వానితో చెప్పుచుండెను. **పక్షవాతముగలవాడు** భయపడుటకు నిశ్చయముగా వానికొక హేతువుండినది: వాని అనారోగ్య పరిస్థితి మరి ఎక్కువ ఘోరము కావచ్చును, వాని స్నేహితులు చేసిన పనికి భారీగా గుమికూడి యుండిన జనసమూహము హింసాత్మకముగా ప్రతిస్పందించవచ్చును, మరియు అన్నిటి కంటె ముఖ్యముగా, ఇంత గొప్ప శక్తిగల ప్రభువు సముఖములో వాడుండుట.

"కుమారుడు" అను మాటకు గల పదము "బిడ్డ" (*teknon*) అని కూడ అనువదింపబడవచ్చును (NJB). దీనిని CEV "స్నేహితుడు" అని అనువదించుచున్నది. ఈ పదము ఏ వయస్సు లేక లింగమునకు సంబంధించిన బిడ్డనైనా, లేక ఒకరు సన్నిహితముగా, వ్యక్తిగతమైన సంబంధము కలిగియున్న ఒక వ్యక్తినైనా సూచించవచ్చును. పక్షవాతముగలవానిని లూకా 5:18 "ఒక మనుష్యుని" అని గుర్తించుచున్నది గనుక, యేసు వానిని సన్నిహితునిగా చేసికొనుచు "కుమారుడా" అను పదమును ఒక ప్రీతి పాత్రమైన పదముగా ప్రయోగించి యుండుట అత్యంత సంభావ్యమై యున్నది.

యేసు పక్షవాయువుగలవానితో పలికిన తదుపరి మాటలు: **నీ పాపములు క్షమింపబడి**

**యున్నవి.** యేసు ఇవ్విధమైన నిశ్చయతను కేవలము రెండు పర్యాయములు మాత్రమే వ్యక్తము చేసాడు, ఈ రెండింటిలో ఇది ఒకటై యున్నది (9:2; లూకా 7:48; లూకా 23:43 చూడు).

సకల రోగములు పాపముతో ముడిపడి యున్నవని యేసు ఇహమందుండిన రోజుల్లో ప్రజాదరణ పొందిన ఒక గొప్ప ప్రజాభిప్రాయమై యుండినది గనుక దానిని నివారించుటకు ఆయన ఎంతో ప్రయాసపడ్డాడు (లూకా 13:1–5; యోహాను 9:1–3).[12] అలాగైతే, యేసు పక్షవాయువుగలవానితో ఈ మాటలు ఎందుకు పలికినట్లు? బహుశా, పాపమును గూర్చిన సమస్య మొదట పరిష్కరింపబడవలసి యుండినందు వలన యేసు ఇలా పలికియుండవచ్చును. టాల్ముడ్‌లో అటుతరువాత గ్రంథస్థం చేయబడిన మూజువాణి ఉపదేశము ఆయన యొద్ద నుండిన ప్రేక్షక సమూహమునకు సుపరిచితమైనదై యుండవచ్చును: “రోగియై యున్నావాని సమస్త పాపములు వానికి క్షమించబడనంత వరకు వాని రోగము నయము కాదు.”[13] వాని రోగము వాస్తవమునకు వాడు చేసిన పాపమునకు ప్రత్యక్ష పర్యవసానమై యుండుట మరొక సాధ్యతయై యున్నది, కొన్ని పర్యాయములు ఇలా సంభవించుచుండినది (యాకోబు 5:14–16). పాపమునుబట్టియు వానికి పక్షవాతముగల పరిస్థితి ఏర్పడినదని వాడు కూడ నమ్మియుండవచ్చును. అసలు పరిస్థితి ఏమైయుండినా, దానితో నిమిత్తము లేకుండానే, యేసు పలికిన మాటలు వానికి గంభీరమైన ఊరట కలిగించియుండుననుటలో సందేహము లేదు.

**వచనము 3.** క్షమాపణ గూర్చి యేసు చేసిన ఘోషణ, ఈ నూతన ఉపదేశకుని పరిచర్య లక్షణమును గూర్చి విమర్శనాత్మకమైన తీర్పు తీర్చుటకే వచ్చారని స్పష్టమగుచున్న వారి తీవ్రమైన విరోధమును తత్‌క్షణమే లేవదీసినది. యేసు ఉపదేశములు ప్రజలలో ఎంతో గొప్ప అలజడి కలుగుటకు హేతువయ్యాయి, గనుక “ఆయన బోధించుచుండగా వినుటకు, గలిలయ యూదయ దేశముల ప్రతి గ్రామము నుండియు యెరూషలేము నుండియు” యూదా మత నాయకులు వచ్చారు (లూకా 5:17). యేసు యెడల అంత వరకు ఎటువంటి విరోధమునైనను ప్రదర్శించని **శాస్త్రులలో కొందరు**, పరిసయ్యులతో కూడ చేరి (లూకా 5:21), ఆయన దేవుని అగౌరవపరచుచున్నాడని యేసును నిందించారు. **ఇతడు దేవ దూషణ చేయుచున్నాడని తమలోతాము అనుకొనగా** మరియు “దేవుడొక్కడే తప్ప పాపమును క్షమింపగలవాడెవడనియు, వారు తమ హృదయములలో ఆలోచించుకొనుచుండిరి” (మార్కు 2:7). పాపములను క్షమించుట దేవునికి మాత్రమే చెందిన విశిష్టాధికారమని వారు పరిగణించారు (కీర్తనలు 103:12; యెషయా 1:18; 43:25; 55:6, 7; యిర్మీయా 31:34; మీకా 7:18, 19).

**వచనము 4**. ఈ సంఘటన యేసు యెడల అధికార సంబంధమైన శత్రుత్వము ఆరంభమగుటకు అనువైన అంశమై యుండినది. మత్తయి వ్రాసిన సువార్త ప్రకారము, దేవదూషణ చేయుచున్నాడను నింద బయటకు అందరికి వినబడేట్లుగా పలుకబడలేదు. యేసును నిందించుచుండినవారు “తమలో తాము” అనుకొనుచుండిరి (9:3; KJV). ఏదిఏమైనా, **యేసు** వారి **తలంపులను** గ్రహించాడు (12:25; 22:18; లూకా 9:47; యోహాను 1:47, 48; 2:25 21:17). గనుక ఆయన, **మీరెందుకు మీ హృదయములలో దురాలోచనలు చేయుచున్నారని** వారిని ప్రశ్నించాడు. ఈ ప్రశ్న ఒక్కటే ఆయన దేవత్వము

గూర్చి సందేహించుచుండిన వారిని ఒప్పించి యుండవలసినది. యేసు వారి ఆలోచనలను మాత్రమే కాదు, కానీ వారి ఆలోచనల వెనుక నున్న దుర్బుద్ధిని సహితము బయట పెట్టాడు. "దుర్ [చెడు]" అను మాట "చెడు కార్యములను ప్రణాళిక వేసుకొనుటను సూచింపవచ్చును, కానీ ఎక్కువగా వారు యేసును గూర్చి చెడుగా ఆలోచించుటకు పరిమితమైనదై యుండగలదు."[14] దేవుని గౌరవమును కాపాడుట ద్వారా వారు మంచి పనే చేయుచుండిరని శాస్త్రులు అనుకొనుచుండిరి, కానీ దేవుని కుమారుని వ్యతిరేకించుట ద్వారా వాస్తవమునకు వారు చెడునే చేయుచుండిరి. యేసు క్రీస్తును ఎదిరించుట, దేవుని ఎదిరించినట్లే. "కుమారుని ఘనపరచనివాడు ఆయనను పంపిన తండ్రిని ఘనపరచడని" యేసు చెప్పాడు (యోహాను 5:23).

**వచనము 5.** అటుతరువాత యేసు ఒక అలంకారయుక్తమైన ప్రశ్నతో వారి పట్ల ప్రతిస్పందించాడు: **నీ పాపములు క్షమింపబడి యున్నవని చెప్పుట సులభమా, లేచి నడువుమని చెప్పుట సులభమా?** ఒక స్థాయిలో, "నీ పాపములు క్షమింపబడియున్నవని" చెప్పుట సులభమై యుండినది, ఏలయనగా ఈ వాంగ్మూలము యొక్క న్యాయసమ్మతమైన విలువను రూఢిపర్చుకొనుటకు లేదా కాదనుటకు అచ్చట నుండిన ప్రేక్షకులకు మరొక మార్గము లేకుండినది. దీనికి తారతమ్యముగా, "లేచి, నడువుమని" చెప్పుటను, పక్షవాయువుగలవాని ప్రతిస్పందన ద్వారా సులభముగా అంచనా వేయుటకు అవకాశముండినది. ఈ మాటలకు వాడు ప్రతిస్పందించనట్లయితే, యేసు బూటకమని రుజువయ్యేవాడే.

మరొక స్థాయిలో, నిజముగానే "నీ పాపములు క్షమింపబడినవని" చెప్పుట, అది మరి ఎక్కువ కష్టతరముగా నుండినది, ఏలయనగా క్షమాపణను ప్రదానము చేయుట, అది కేవలము దైవికమైన విశిష్టాధికారమై యుండినది. ఇతరులను శారీరకముగా స్వస్థపరచునట్లు ఒకనికి అధికారమియ్యబడి యుండవచ్చును, కానీ అలాగని పాపములు క్షమింపబడి యున్నవని ప్రకటించుటకు వానికి హక్కు కలదని దీని అర్థము కాదు. యేసు, దేవుని దైవికమైన కుమారుడుగా, "లేచి నడువుమని" చెప్పుట ఆయనకు ఎంత సులభమో, "నీ పాపములు క్షమింపబడి యున్నవని" చెప్పుట కూడ ఆయనకు అంతే సులభమని ఆయనను విమర్శించుచుండినవారు అర్థంచేసికొనవలెనని ఆశించాడు. శారీరకముగానైతేనేమి ఆధ్యాత్మికముగానైతేనేమి స్వస్థపరచు అధికారము ఆయన కలిగియుండెనని ఆయన ఉదాహరణంగా చిత్రీకరించుచుండెను.

**వచనములు 6, 7.** స్వాభావికము మరియు ఆధ్యాత్మికమునైన ప్రపంచముపై గల తన **అధికారమును** ప్రభువు ఇదివరకు ప్రదర్శించాడు, నిత్య రాజ్యముందు అధికారమును ఆయన ఇచ్చుట ప్రదర్శించాడు (7:28, 29; 8:9పై గల వ్యాఖ్యానము చూడు). ఆది పరలోకము నుండైనా లేక **భూమి మీదనైనా, పాపములను క్షమించుటకు** ఆయనకు అధికారముండినది. ఈ అధికారము అంగీకరింపబడిన యేసు యొక్క స్వయం హోదాకు, మనుష్యకుమారునికి, అనుగుణ్యముగా నుండినది. దానియేలు 7:13, 14లోని ప్రవచనము ప్రకారము, ఏర్పాటయిన కాలమందు, "ప్రభుత్వమును, మహిమను మరియు ఆధిపత్యమును" ఆయనకిచ్చాడు.

పాపములను క్షమించుటకు ఆయనకు అధికారము కలదనుటకు నిదర్శనముగా, యేసు **నీవు లేచి, నీ మంచమెత్తికొని నీ ఇంటికి పొమ్మని పక్షవాయువుగలవానితో**

చెప్పాడు. పక్షవాయువుగలవాడు యేసు యొద్దకు మంచముతో కూడ మోసికొని తీసుకరాబడినాడు (9:2); ఇప్పుడు వాడే సొంతగా తన మంచమెత్తికొని వెళ్లవలసినదని యేసు చేత ఆదేశములియ్యబడినాడు. దీనిని మౌన్స్ ఇలా వివరించుచున్నాడు, “యేసు కాలములో ప్రజలలో అధిక సంఖ్యాకులు నేల మీద పరువబడిన పరుపుల వంటి వెడల్పాటి మెత్తని దిండ్ల మీద నిదురించుచుండిరి. ఈ విధంగా పరవబడి యుండిన చాప [NIV], అనవసరమైన కష్టమేమీ కలుగకుండా ఒకరిని సులభంగా మోసికొనివచ్చుటకు అనువుగా నుండిన ఒక విధమైన చిన్న మెత్త లేక స్ట్రెచ్చరు వంటిదై యుండినది.”[15] ఎటువంటి సంకోచమైనను లేకుండానే, యేసు జారీ చేసిన ఆదేశమును వాడు శిరసావహించుచు **లేచి తన ఇంటికి వెళ్లెను**. తత్ఫలితంగా, దుర్బలమైన దేహమును స్వస్థపరచుటకు ఆయనకుండిన సామర్థ్యము, ఆయన ఆత్మను సహితము స్వస్థపరచగలడనుటకు సాక్ష్యముగా నిలిచినది.

**వచనము 8.** జరిగినది చూచిన **జనులు** అనగా, యేసు యొద్దకు మోసికొని తీసుకురాబడినవాడు ఇప్పుడు వాస్తవముగా లేచి, వాని మంచమెత్తికొని, కాలి నడకన వాని ఇంటికి కదలివెళ్లుట చూచినవారు, అపరిమితముగా ఆశ్చర్యపడిరి. “తక్షణమే వాడు లేచి, పరుపెత్తికొని, వారందరి యెదుట నడచిపోయెను గనుక, వారందరు విభ్రాంతి నొందిరని” మార్కు 2:12 చెప్పుచున్నది. **జనులు భయపడిరని** మత్తయి వ్రాసిన సువార్త చెప్పుచున్నది. ఇచ్చట ప్రయోగింపబడిన *phobeō* అను గ్రీకు క్రియాపదము *phobos* అను నామవాచక పదముతో సంబంధముగలదై యున్నది, మరియు “phobia” అను పదము దీని నుండి ఉత్పన్నమగుచున్నది. ఈ పదములు తరుచుగా “భయము” అని అనువదింపబడుచున్నప్పటికిని, అవి కొన్ని పర్యాయములు క్రొత్త నిబంధనలో “భక్తిపూర్వకమైన సంభ్రమాశ్చర్యము”ను తెలియజేయుటకు ఉపయోగింపబడినవి (లూకా 1:50; 18:2, 4; అపొస్తలుల కార్యములు 10:35; 13:17, 26; రోమీయులకు 3:18; 2 కొరింథీయులకు 5:11; 7:1; కొలొస్సయులకు 3:22; 1 పేతురు 1:17; 2:17; ప్రకటన 11:18; 14:7; 19:5). జరిగినదానంతటిని గమనించుచుండినవారు **మనుష్యులకిట్టి అధికారమిచ్చిన దేవుని మహిమపరచిరి**. వారు భయభీతి చెందియున్నట్లయితే దేవుని మహిమపరచుట, సమర్థింపబడుటకు సబబైన సంగతిగా లేశమాత్రమైనను అగుపించుట లేదు.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### “యేసు ఎవరు?” (8:27)

యేసు సముద్రము మీద లేచిన తుఫానును నిమ్మళింపజేసిన తరువాత, నివ్వెరపోయిన శిష్యులు, “ఈయన ఎట్టివాడో, ఈయనకు గాలియు సముద్రమును లోబడుచున్నవని” ఒకరితో నొకరు చెప్పుకొనుచుండిరి (8:27). మార్కు వ్రాసిన సువార్తలో, “ఈయన ఎవరో? ...” అని ఒకనితో నొకడు చెప్పుకొన్నట్లు వ్రాయబడి యున్నది (మార్కు 4:41; NLT). సువార్తలలో, యేసు గుర్తింపు గూర్చిన ప్రశ్న అత్యంత ప్రాముఖ్యతగల విషయమై యున్నది. యేసు బాప్తిస్మము పొందిన సమయంలోను, రూపాంతరము చెందిన సమయంలోను తండ్రియైన దేవుడు ఆయనను తన కుమారునిగా గుర్తించాడు (3:17; 17:5). యేసు

దేవుని కుమారుడని సాతాను ఆయనను గుర్తించాడు, అంతటితో ఆగిపోక ఆయనను శోధించుటకు ఈ వాస్తవమును వాడు సద్వినియోగం చేసుకొన్నాడు (4:3, 6). దయ్యములు సహితము యేసు యొక్క దైవత్వమును గుర్తించినవి (8:29). ఏదిఏమైనా, యేసు గుర్తింపును గూర్చిన విషయం మాత్రం యూదా మత ప్రజలలో తరుచుగా చర్చింపబడుచుండిన ఒక గొప్ప చర్చనీయాంశమై యుండినది (16:13, 14; మార్కు 6:14-16; యోహాను 7:40-44). యేసు ఖచ్చితంగా ఎవరై యుండెనో, ఆయన సొంత శిష్యులే తరుచుగా అనిశ్చితులై యుండిరి. ఈ విషయమై ఆయన వారిని పరీక్షిస్తూ ప్రశ్నించినప్పుడు, పేతురు సరైన విషయాన్ని ఒప్పుకొన్నాడు: "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" (16:16). ఏది ఏమైనా, పునరుత్థానము తరువాత కూడ, శిష్యులలో కొందరు సందేహపడ్డారు (28:17).

"యేసు ఎవరు?" అను ప్రశ్న నేటికి కూడ ఒకరు జవాబు చెప్పవలసి యున్న అత్యంత ప్రాముఖ్యమైన ప్రశ్నయై యున్నది. యేసు, దేవుని కుమారుడు, మానవుల నిత్యజీవము కొరకై వారికి అందుబాటులో నున్న ఒకే ఒక్క మార్గముగా తనను తానే గుర్తించుకొన్నాడు (యోహాను 14:6; అపొస్తలుల కార్యములు 4:12 చూడు). "నేనేమైయున్నానని మీకు నేను సాధికారంతో తెలియజెప్పుచున్నానో దానిని మీరు నమ్మనట్లయితే, మీరు నిజముగా మీ పాపములలోనే యుండి మరణించెదరని" కూడ ఆయన ఘోషించాడు (యోహాను 8:24; NIV). ఈ సత్యమును సరిగా ఒప్పుకొనుట దేవుని కృప యెడల మానవుని విశ్వాసముతో కూడిన ప్రతిస్పందనలో భాగమై యున్నది, ఇది వాని రక్షణకు హేతువగును (10:32, 33; అపొస్తలుల కార్యములు 8:37; రోమీయులకు 10:9, 10; 1 తిమోతి 6:12). యేసు గుర్తింపు గూర్చిన ప్రశ్నకు మనము సమాధానము తెలియజెప్పు విధానము మన నిత్య గమ్యమును నిర్ధారించును.

డేవిడ్ స్టూవర్ట్

## దయ్యములు (8:28-34)

దయ్యములు ఎక్కడ నుండి వచ్చినవో, వాటి మూలమేమిటో వివరించుటకు అనేక సలహాలు ఇవ్వబడినవి. దుర్మార్గులు మరణించిన పిదప వారి ఆత్మలు మరలా భూలోకమునకు మరలివచ్చి స్థిరనివాసమేర్పరచుకొని సంచరించుచుండిన ఆత్మలై యుండెనని కొందరు నమ్ముదురు. ఏదిఏమైనా, ఇలాంటి ఒకడు మరణించిన పిదప వాని ఆత్మ ఇహమునకేతెంచి మరొకని శరీరములో నివాసమేర్పరచుకొనినదని చెప్పుటకు ఒక ఉదాహరణము ఎన్నడును లభించలేదు. అవి చెడు పనులు చేయు నిమిత్తము దేవుని చేత సృష్టింపబడిన ప్రాణులై యున్నవని ఇతరులు నమ్ముదురు. ఈ దృక్పథమును నేరుగా తృణీకరింపవచ్చును ఏలయనగా తొల్దొలుత దేవుడు సృజించిన సమస్తమును "మంచిదై" యుండినది (ఆదికాండము 1:31). అవి పతనమైన దూతలై యుండి (2 పేతురు 2:4; యూదా 6వ చూడు), ప్రస్తుతము సాతాను నాయకత్వము క్రింద ఉంటున్నవనునది (12:24; 25:41; మార్కు 3:22, 23) బహుశా అత్యంత సహేతుకమైన సమాధానమై యుండును.

దయ్యములు పట్టి పీడింపబడుట ప్రత్యేకముగా క్రొత్త నిబంధన దృగ్విషయమై యున్నదనునది దయ్యముల గూర్చిన అధ్యయనములోని ఒక ఆకర్షణాత్మకమైన అంశమై యున్నది. రాజైన సౌలు మనుస్సులో భయాందోళనలు కలిగించిన "దురాత్మ యొకదాని"

గూర్చి పేర్కొనబడి యున్నది (1 సమూయేలు 16:14-23). ఇది ఏమైయుండినా, ఆది క్రొత్త నిబంధనలో దయ్యము పట్టి పీడింపబడు విషయమునకు నాటకీయంగా భిన్నమైనదై యుండెను. దయ్యము ఒకని దేహమును దాని అధీనము చేసికొనిన విషయము పాత నిబంధనలో ఒక్క ఉదాహరణమైనను లేదు.

దేవుడు సాతాను శక్తిపై కలిగియుండిన తన అధికారము యొక్క అధికృతను ప్రదర్శించుటకు మొదటి శతాబ్దము నాటి కాలములో దయ్యములు మానవుని దేహములో నివాసమేర్పరచుకొనునట్లు ఆయన వాటిని అనుమతించి యుండును. దయ్యములు పట్టి పిడించినట్లు సువార్తలలోను, అపొస్తలుల కార్యముల గ్రంథములోను పేర్కొనబడి యుండగా, క్రొత్త నిబంధనలోని అటుతరువాతి పుస్తకములలో అది పేర్కొనబడలేదు. దయ్యములను వెళ్లగొట్టు అధికారము యిక లేనప్పుడు, అవి మానవుల దేహములలో నివాసమేర్పరచుకొనుటకు యిక మీదట అనుమతింపబడలేదనునది తర్కబద్ధమైన తుది అభిప్రాయమై యున్నది.

"ఉచ్చాటన చేయుట" లేక "దయ్యములను వెళ్లగొట్టుట" (*exorkizō*) యను పదము "మంత్రవిద్య చేత వెళ్లగొట్టుట" అని అర్థమిచ్చునది, దయ్యములను వెళ్లగొట్టుటకు సంబంధించినంత వరకు క్రొత్త నిబంధనలో ఎన్నడును ప్రయోగింపబడలేదు. దయ్యము పట్టి పీడింపబడుచున్నాడను ఒక వ్యక్తిలో నుండి దయ్యమును తరిమివేయుటకు రూపొందింపబడిన ఒక మంత్రోచ్చార ఆచారమును అది సూచించుచున్నది. ఆజ్ఞానులైనవారిని మరియు అనుమానించనివారిని వంచించి డబ్బు లాగుకొనుటకు మంత్ర విద్యతో కూడిన (exorcism) ఉచ్చాటన నేడు అనేక మంది అల్పజ్ఞుల చేత ప్రయోగింపబడుచున్నది.

ఈ రోజుల్లో కూడ దయ్యములు మానవుల దేహములను వాటి నివాస స్థలములుగా చేసికొనుచున్నవని యింకను కొందరు నమ్ముదురు. లిన్ ఏ. మ్యాక్‌మిలన్ దీనిని ఇలా వివరించుచున్నాడు,

> దయ్యములు పట్టి పీడింపబడుచున్న వారిని గూర్చిన సంఘటనలు కొన్ని పర్యాయములు సాంప్రదాయ సంఘముల మిషనెరీలు మరియు సాంస్కృతికపరంగా వెనుకబడిన దేశ ప్రజలను పరీక్షించుచున్న సమాజ శాస్త్రవేత్తల చేత నివేదింపబడుచున్నవి. దయ్యములు పట్టిన వారి గూర్చిన కథలు సాధారణంగా చైనా, ఇండియా, బోరియో, మరియు ఆఫ్రికా వంటి సుదూరములో నున్న దేశాల్లోని మారుమూల ప్రదేశాల్లో నుండు ప్రజల నుండి మనకు తెలియవచ్చును. దయ్యముల చేత పట్టి పీడింపబడుచుండు సంఘటనలు, పెరిగిపోవుచుండు నాగరికత మరియు విద్యాభ్యాసము యొక్క స్థాయితో సమగ్రముగా తక్కువగుచుండుననియు, గనుకనే అత్యధికంగా సాంకేతిక పురోభివృద్ధి సాధించిన సమాజముల కంటే సాంస్కృతికపరంగాను, విద్యాభ్యాస ప్రమాణముల పరంగాను వెనుకబడిన ప్రాంతములలోనే దయ్యముల చేత పీడింపబడుచున్న సందర్భములు ఎక్కువగా కనుగొనుటకు ఒకరు ఆశించవచ్చుననియు సమాజ మానసికశాస్త్రవేత్తలు గమనించుచున్నారు. దయ్యములు పట్టుట అంగీకరింపబడు ప్రాంతాల్లో, పెడదారి పట్టిన ప్రవర్తనకు సంబంధించిన అనేక రూపముల విషయంలో అది ఒక వివరణమౌతోంది. "దయ్యములు పట్టిన పరిస్థితులను" మరియు వాటి గూర్చిన నమ్మకమును కలుగజేయుటకు సాంస్కృతిక వాతావరణము బాధ్యత వహించుచున్నదను నిజమును నిర్ధారించుటకు ఈ వాస్తవము దోహదపడుచున్నది.[16]

ఈ రోజుల్లో దయ్యములు మానవుల దేహములలో నివాసమేర్పరచుకొనుటకు అనుమతింపబడలేదు. అయినప్పటికినీ, వాటి ప్రభావము లోకములో యింకను స్పష్టముగా అగుపించుచునే యున్నది, గనుకనే వాటిని మనము ఎదిరించవలసి యున్నది (యాకోబు 4:7, 8).

## రక్షించు విశ్వాసము (8:29)

యేసు, దేవుని కుమారుడై యున్నాడని దయ్యములు నిరాటంకముగా ఒప్పుకొన్నవి (8:29). వాటి వాంగ్మూలము అనిశ్చయతతో కూడినది కాదు. రక్షించుటకు విశ్వాసము మాత్రమే చాలదనుటకు ఇది బైబిలు సంబంధమైన నిదర్శనమై యున్నది. మృతమైన విశ్వాసము, అచేతనమైన విశ్వాసము మనలను రక్షించనేరదు. యాకోబు "మృతమైన" విశ్వాసము గూర్చి చర్చించుచుండినప్పుడు, ఆయన ఇలా ప్రకటించాడు: "దేవుడొక్కడే అని నీవు నమ్ముచున్నావు. అలాగు నమ్ముట మంచిదే: దయ్యములను నమ్మి, వణకుచున్నవి" (యాకోబు 2:17, 19).

## మన అతి గొప్ప ఆవశ్యకత (9:1–8)

మనము ప్రజలకు ఆధ్యాత్మిక పరిచర్య చేయక మునుపు మొదట వారి భౌతిక అవసరములను తీర్చవలెనని తరుచుగా చెప్పబడుచున్నది. ప్రజలకు ఆహారము, వస్త్రములు, తలదాచుకొనుటకు గూడు, మరియు ఇతర జీవిత కనీస అవసరతలు కొరతగా ఉన్నట్లయితే, వారు ఆధ్యాత్మిక విషయాల గూర్చి ఆలోచించుటకు వారికి కష్టముగా నుండును. ఇదొక న్యాయసమ్మతమైన గమనికయై యుంటున్నప్పటికినీ, మనము ఇతరలకు సహాయము చేయుటకు చేయు ప్రయత్నంలో తరుచుగా వారి భౌతిక స్థాయిని దాటిపోము. ఏది ఏమైనా, ఈ కథలో యేసు మొదట పక్షవాయువుగలవాని ఆధ్యాత్మిక అవసరమును తీర్చాడు: ఆయన వాని పాపములను క్షమించాడు. అటు తరువాతనే, ఆయన వాని పక్షవాతమును స్వస్థపరచాడు. మనము దేవునితో కలిగియుండవలసిన సంబంధము పున:రుద్ధరింపబడుటకు గల మన అవశ్యకత ఏ భౌతిక అవసరమునైనను మించినదై యున్నది, ఏలయనగా అది నిత్యత్వమునకు సంబంధించిన విషయమై యున్నది.

డేవిడ్ స్టూవర్ట్

---

సూచనలు

[1]Robert H. Mounce, *Matthew*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 78. [2]Matthew Henry, *Commentary on the Whole Bible* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1960), 1243. [3]D. A. Carson, *When Jesus Confronts the World: An Exposition of Matthew 8-10* (Grand Rapids, Mich.: Baker Book House, 1987), 50. [4]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 129. [5]NIVలో, ఇతర రెండు స్థలముల పేర్లు పేర్కొనబడుచు ప్రతి లేఖన వాక్యముతో కూడ ఒక అదఃస్సూచిక ఇవ్వబడి యున్నది – మత్తయి 8:28; మార్కు 5:1; మరియు లూకా 8:26. [6]Josephus *Life* 9.42. [7]Vassilios Tzaferis, "A Pilgrimage to the Site of the Swine Miracle," *Biblical Archaeology Review* 15 (March-April 1989): 44-51 చూడు. [8]Leon Morris, *The Gospel according to Mat-*

*thew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 208. [9]Josephus *Wars* 3.3.5. [10]Mishnah *Baba Kamma* 7.7.

[11]Donald A. Hagner, *Matthew 1-13*, Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 227. [12]Talmud *Shabbath* 55a; Mishnah *Sotah* 1.7, 8 చూడు. [13]Talmud *Nedarim* 41a. [14]Morris, 216. [15]Mounce, 82. [16]Lynn A. McMillon, *Doctrines of Demons* (Nashville: Gospel Advocate Co., 1975), 98.